www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

బుధవారం, 15-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :76 Issue : 76 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని పర్యటన



5



## పబ్లిక్‌గా ఫొటోగ్రాఫర్‌కు చుక్కలు చూపించిన బాలీవుడ్ నటి!

8

# పేదల సొంతింటి కల

## క్యూర్ పరిధిలో లక్ష 'ఇందిరమ్మ LIG' ఇండ్లు



- క్యూర్ (CURE) పరిధిలోని పేదల కోసం దశలవారీగా 1,00,000 ఇళ్ల నిర్మాణం.
- 2026-27 లోగా ఈ నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది.
- ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే పరిపాలనా అనుమతులు కూడా లభించాయి
- ఈ నెల 20వ తేదీన అధికారికంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తారు

2



## నేడు హైదరాబాద్‌కు

# పవన్ కల్యాణ్..

- ముంబైలో పవన్ కల్యాణ్ కుడి భుజానికి విజయవంతమైన శస్త్రచికిత్స.
- ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్.. నేడు హైదరాబాద్‌కు రాక.
- 2 నెలల విశ్రాంతి: పూర్తిగా కోలుకునేందుకు 60 రోజుల పాటు విశ్రాంతి, రోజూ ఫిజియోథెరపీ.
- ఎడమ భుజానికి కూడా రెండు నెలల తర్వాత శస్త్రచికిత్స అవసరం.

2



## వర్షా లు తక్కువ - ఆందోళన వద్దు

- రైతులకు మంత్రి తుమ్మల కీలక సూచనలు
- నీరు తక్కువగా తీసుకునే జొన్న, సజ్జ, కొర్ర, కంది, పెసర వంటి పంటలను వేసుకోవాలి.
- ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే 30%-35% తక్కువ వర్షపాతం నమోదైంది.
- ఎగువ రాష్ట్రాల్లో వర్షా లు లేక కృష్ణా, గోదావరి నదులలో నీటి లభ్యత తగ్గుతుంది.
- రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉంది.
- వరి, చెరకు కాకుండా తక్కువ కాలంలో పండే ప్రత్యామ్నాయ రకాలను ఎంచుకోవాలి

2

## ఆర్ఆర్ఆర్, హైవే ప్రాజెక్టులపై

# సీఎం రేవంత్ విజ్ఞప్తి



- RRR పనులు: 95% భూసేకరణ పూర్తయిన ఉత్తర భాగంతో పాటు, దక్షిణ భాగం పనులను ఒకేసారి మొదలుపెట్టాలి.
- గ్రీన్‌ఫీల్డ్ హైవే: విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ - అమరావతి హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలి.
- 12 లేన్ల రహదారి: ఫ్యూచర్ సిటీ నుండి బందరు పోర్టు కారిడార్‌తో విజయవాడ దూరం 100 కి.మీ తగ్గుతుంది.
- శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్: నల్లమల అటవీ ప్రాంతం మీదుగా సాగే ఈ ప్రాజెక్టుకు అటవీ అనుమతులు ఇప్పించాలి

**ఢిల్లీ, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణలో కీలక రహదారి ప్రాజెక్టులకు వేగం తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీలో గడ్కరీ నివాసంలో జరిగిన సమావేశంలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), గ్రీన్‌ఫీల్డ్ హైవే, మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్-మంచిర్యాల ప్రత్యామ్నాయ జాతీయ రహదారి తదితర ప్రాజెక్టులపై చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిందని, కేంద్ర మంత్రిమండలి అనుమతి ఇచ్చి వెంటనే పనులు

మిగతా 2వ పేజీలో..



## వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి



- అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు: వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి.
- వరంగల్ గడువు: జూన్ 2, 2028 నాటికి ప్రారంభం.
- ఆధునిక సదుపాయాలు: కార్గో, ఎంఆర్‌ఓ, పైలట్ శిక్షణ కేంద్రాలు.
- సీ ప్లేన్: హుస్సేన్‌సాగర్ - ప్రకాశం బ్యారేజీల మధ్య సర్వీసులు.

2

# ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు



- గత అప్పులు: తెలంగాణపై ₹8.21 లక్షల కోట్ల అప్పుల భారం.
- ప్రభుత్వ చెల్లింపులు: రెండున్నరేళ్లలో ₹2.08 లక్షల కోట్లు అసలు, వడ్డీల చెల్లింపు.
- అప్పులు తీరుస్తూనే ప్రజా సంక్షేమాన్ని ఆపకుండా ముందుకు సాగడం
- ఉచిత బస్సు ప్రయాణం: మహిళల కోసం ఆర్టీసీకి ₹12,000 కోట్ల చెల్లింపు

3



## రక్తం పాకెట్లతో రాజకీయం

# అవసరం లేదు..

- కాళేశ్వరంపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు
- ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పెంచాలని ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ బృందం కోరింది.
- హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ నెమ్మదించినందున గడువు పెంచాలని ఈసీని కోరారు.
- ప్రాజెక్ట్ కుంగిపోవడానికి బీఆర్ఎస్సే కారణమని, దీనిపై రక్తం పాకెట్లతో రాజకీయం వద్దన్నారు

3



## రాజకీయం పక్కనపెట్టి నీటి కష్టాలు తీర్చండి..

- కన్నెపల్లి పంప్‌హౌస్: దీని ద్వారా నీటిని తోడితేనే కష్టాలు తీరుతాయి.
- బొగ్గు గని: సింగరేణికి కేంద్రమే 'తాడిచర్ల బొగ్గు గని' కేటాయించింది.
- భరోసా యాత్ర: కాంగ్రెస్ వాస్తవాలను ఎండగట్టడానికే మా యాత్ర
- ప్రభుత్వ నిర్లక్ష్యం: వాతావరణ మార్పులు, కరువు హెచ్చరికలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

2

## డీజీపీ సి.వి. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా

# కలిసిన డీఎస్పీ నిఖత్ జరీన్

- డీజీపీ సి.వి. ఆనంద్‌తో తెలంగాణ పోలీస్ డీఎస్పీ, బాక్సింగ్ స్టార్ నిఖత్ జరీన్ మర్యాదపూర్వక భేటీ

4



# ఆర్‌ఆర్‌ఆర్, హైవే ప్రాజెక్టులపై సీఎం రేవంత్ విజ్ఞప్తి

**మొదటిపేజీ తరువాయి**

ప్రారంభించాలని సీఎం కోరారు. ఉత్తర, దక్షిణ భాగాల్లో ఒకేసారి పనులు ప్రారంభిస్తే నిర్మాణం వేగంగా పూర్తవడంతో పాటు వ్యయం కూడా తగ్గుతుందని వివరించారు.

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన కేంద్ర అనుమతులను కూడా తక్షణమే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం (బందరు) పోర్టు వరకు 12 లేన్ల రహదారి మంజూరైతే హైదరాబాద్-విజయవాడ మధ్య దూరం సుమారు 100 కిలోమీటర్లు తగ్గడంతో పాటు సరుకు రవాణా మరింత వేగవంతం అవుతుందని వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయడానికి కేంద్రం సహకరించాలని సీఎం కోరారు. ఈ ప్రాజెక్టు నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, జలాశయ ప్రాంతాలతో అనుసంధానమై ఉందని తెలిపారు. హైదరాబాద్-మంచిర్యాల మధ్య రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఆరు లేన్ల జాతీయ రహదారి మంజూరు చేయాలని కూడా సీఎం ప్రతిపాదించారు. ఈ రహదారికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుందని, ఈ ప్రాజెక్టు వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపార రంగాలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## నేడు హైదరాబాద్‌కు పవన్ కల్యాణ్..

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు హైదరాబాద్ చేరుకోనున్నారు.. ముంబైలోని కోకిలా బెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 11న ఆయన కుడి భుజంలోని షోల్డర్ రొటేటర్ కఫ్ సమస్యకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రముఖ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దిన్‌షా పార్థీవాలా నేతృత్వంలోని వైద్య బృందం ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. శస్త్రచికిత్స అనంతరం నాలుగు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు. ఆయన రేపు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. పూర్తి కోలుకునేందుకు సుమారు 60 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని, అలాగే ప్రతిరోజూ కుడి చేతికి ఫిజియోథెరపీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఇక, కుడి భుజం పూర్తిగా కోలుకున్న తర్వాత రెండు నెలల అనంతరం ఎడమ భుజానికి కూడా శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం.

పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స చేసిన డాక్టర్ దిన్‌షా పార్థీవాలా దేశంలోని ప్రముఖ స్పోర్ట్స్ సర్జన్లలో ఒకరు. గతంలో క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్, రిషభ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాతో పాటు ఒలింపిక్ విజేతలు నీరజ్ చోప్రా, పీవీ సింధు, సైనా నెహ్వాల్ వంటి ప్రముఖ క్రీడాకారులకు కూడా ఆయన విజయవంతంగా చికిత్స అందించారు. అంతేకాకుండా పలువురు ప్రముఖ రాజకీయ నాయకులకు కూడా వైద్య సేవలు అందించిన అనుభవం ఆయనకు ఉంది. కాగా, పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స తర్వాత ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్.. పలువురు ఏపీ మంత్రులు, జనసేన నేతలు.. ఇతర పార్టీల నేతలు కూడా ఆయన్ని పరామర్శించి.. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు..

# నగరంలోని నిరుపేదలకు గుడ్ న్యూస్ క్యూర్ పరిధిలో లక్ష 'ఇందిరమ్మ LIG' ఇండ్లు

- **క్యూర్ (CURE) పరిధిలోని పేదల కోసం లక్ష ఇందిరమ్మ ఎల్‌ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.**
- **నగరంలోని నిరుపేదలకు గుడ్ న్యూస్: క్యూర్ పరిధిలో లక్ష 'ఇందిరమ్మ LIG ఇండ్లు**

**ఆశ్వి అప్డేట్స్**

గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లతో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ పరిధిలోని పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్.ఐ.జీ. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలనా అనుమతులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో ఎల్‌ఐజీ ఇందిరమ్మ ఇండ్లపై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్‌ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాలను, దరఖాస్తుల ఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు.

202627 ఆర్థిక సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్‌ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున, ఆయా స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అక్కడక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది అక్కడ నివసించలేకపోయారని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే, వారి ఉపాధి, పిల్లల విద్య, వైద్య సౌకర్యాలు, రవాణా వంటి అంశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని అత్యంత ముఖ్యమైన ప్రాంతాలలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మిస్తోందని అన్నారు. ఆ స్థలంలో వారికి వాటా ఇస్తూ యాజమాన్య హక్కు కల్పిస్తూ వారి కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామన్నారు.

క్యూర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించడం జరిగిందని, ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్‌లోకి తీసుకుందని తెలిపారు. ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్‌లను సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి రెండు, మూడు రోజులలో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.





# వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి

- **కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జూలై 14:, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం జరిగిన సమావేశంలో రెండు విమానాశ్రయాల నిర్మాణం, మౌలిక సదుపాయాలు, భవిష్యత్ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ విమానాశ్రయం ఉత్తర తెలంగాణకు కీలక కేంద్రంగా మారుతుందని తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ఈ విమానాశ్రయం ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే భూసేకరణ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి, 2028 జూన్ 2 నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌ఓ, ఎయిర్ కార్గో, హ్యాంగర్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు, కాకతీయుల చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించేలా టెర్మినల్ డిజైన్ రూపొందించాలని సీఎం సూచించారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని ఎయిర్‌స్ట్రిప్‌తో పాటు పౌర విమానాశ్రయం అభివృద్ధి చేయాలని కోరిన సీఎం, అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే వరంగల్ తరహాలోనే ఆదిలాబాద్‌లో కూడా ఎంఆర్‌ఓ, ఎయిర్ కార్గో, హ్యాంగర్ సదుపాయాలు, రెండు విమానాశ్రయాల్లో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (FTO) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీ ప్లేన్ సేవలు ప్రారంభించే అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించగా, దీనిపై ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం సీఎం మాట్లాడుతూ, "అభివృద్ధికి రాజకీయాలకు సంబంధం లేదు. ప్రజల ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయంతో పనిచేస్తున్నాం" అని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, విమానాశ్రయాల కోసం అవసరమైన భూసేకరణను దేశంలోనే అత్యంత వేగంగా పూర్తి చేసి తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. వరంగల్ విమానాశ్రయం కాకతీయ సంస్కృతికి ప్రతిబింబంగా ఉండేలా రూపకల్పన చేస్తామని తెలిపారు.

# రాజకీయం పక్కనపెట్టి నీటి కష్టాలు తీర్చండి.. ప్రభుత్వంపై ఈటల రాజేందర్ ఫైర్

- **కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని తోడితేనే రాష్ట్రంలో రైతాంగానికి, ప్రజలకు నీటి కష్టాలు తీరుతాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.**
- **రాజకీయం పక్కనపెట్టి నీటి కష్టాలు తీర్చండి.. ప్రభుత్వంపై ఈటల రాజేందర్ ఫైర్**

**ఆశ్వి అప్డేట్స్**

రాష్ట్రంలో తాగు, సాగునీటి కష్టాలపై రాజకీయాలు పక్కనపెట్టి తక్షణమే పరిష్కారాలు చూపాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ (MP Etala Rajender) రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి (Singareni) సంస్థకు 'తాడిచర్ల బ్లాక్2' బొగ్గు గనిని కేటాయించిన సందర్భంగా కార్మికుల్లో భరోసా నింపేందుకు బీజేపీ చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న నీటి విధానాలు, సింగరేణిపై చేస్తున్న రాజకీయంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో (El Nino) ప్రభావం వల్ల రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా మేల్కొని కరువు హెచ్చరికలపై దృష్టి పెట్టాలని, రాజకీయ విమర్శలకు మాని సాగునీటి సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈటల డిమాండ్ చేశారు.

**కన్నెపల్లి పంప్‌హౌస్‌తోనే నీటి కష్టాలు తీరుతాయి..**

అయితే, నీటి లభ్యత ఉన్న చోట నుంచి సద్వినియోగం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోందని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. కన్నెపల్లి పంప్‌హౌస్ (Kannepalli Pump House) ద్వారా నీటిని తోడితేనే రైతాంగానికి, ప్రజలకు నీటి కష్టాలు తీరుతాయని ఆయన స్పష్టం చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే మేడిగడ్డ, ఇతర ప్రాజెక్టుల అంశంలో బురదజల్లే రాజకీయం చేస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి కట్టుబడి ఉందనడానికి తాడిచర్ల బ్లాక్ 2 కేటాయింపే నిదర్శనమని గుర్తుచేశారు. ఈ కేటాయింపు చేసింది కేంద్ర బొగ్గు గనుల శాఖ అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు సంబరాలు చేసుకుంటుందో అర్థం కావడం లేదంటూ ఈటల సెటైర్లు వేశారు. సింగరేణిని దోపిడీ చేసిన ఘోరమైన చరిత్ర కాంగ్రెస్‌దేనని, వాస్తవాలను కార్మికులకు వివరించేందుకే తాము 'సింగరేణి భరోసా యాత్ర' చేపట్టామని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.



# వర్షా లు తక్కువ - ఆందోళన వద్దు

- **నీరు తక్కువగా తీసుకునే జొన్న, సజ్జ, కొర్ర, కంది, పెసర వంటి పంటలను వేసుకోవాలి.**
- **ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే 30%-35% తక్కువ వర్షపాతం నమోదైంది.**
- **ఎగువ రాష్ట్రాల్లో వర్షా లు లేక కృష్ణా, గోదావరి నదులలో నీటి లభ్యత తగ్గుతుంది.**
- **రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉంది.**
- **వరి, చెరకు కాకుండా తక్కువ కాలంలో పండే ప్రత్యామ్నాయ రకాలను ఎంచుకోవాలి.**

**తెలంగాణ బ్యూరో :, ఆశ్వి అప్డేట్స్**

ఈ ఏడాది రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతుందని, దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జలాల, భారత వాతావరణ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని ఎల్‌నినో పరిస్థితులతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం భారత వాతావరణ శాఖ సంచాలకురాలు స్టెల్లా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులు సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని ఐఐఎంఆర్ డైరెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య, శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు.




# రూ.3 లక్షల నగదుతో డ్రైవర్ పరార్

- **ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు.. నార్సింగి నివాసి కోసం గాలింపు**

**హైదరాబాద్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**




Telangana State Police Department

Reception Centre Acknowledgement

Police Station : LB Nagar — District : Malkajgiri
Acknowledgment Number : MLKGR/LBNR_RCHKD/140726/04505
Date & Time of Submission : 14-07-2026 18:31
Applicant Name : ashok reddy mudhireddy — Service Name : Petition
Applicant Contact No : 9963059135 — Sub Service : Crime Petition
Issue Authority
Name : SAARLA ASHWINI

యజమాని నమ్మకాన్ని వమ్ము చేస్తూ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం అప్పగించిన రూ.3 లక్షల నగదుతో డ్రైవర్ పరారైన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
పోలీసుల వివరాల ప్రకారం.. విష్ణు అనే వ్యక్తి గత నెలలో ముదిరెడ్డి అశోక్ రెడ్డి వద్ద డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరాడు. ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లాలని యజమాని అతనికి రూ.3 లక్షల నగదును అప్పగించాడు. అయితే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లకుండా నగదుతో పరారయ్యాడు. బాధితుడు విష్ణు కుటుంబ సభ్యులను సంప్రదించగా, తమ ఇంట్లో శుభకార్యం ఉందని, తమ పరువు తీయవద్దని కోరుతూ, విష్ణును తీసుకొచ్చి నగదు తిరిగి చెల్లిస్తామని పలుమార్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే దాదాపు 20 రోజులు గడిచినా విష్ణు ఆచూకీ గానీ, నగదు గానీ లభించలేదు. పోలీసుల సమాచారం ప్రకారం, పరారీలో ఉన్న నిందితుడు విష్ణు రంగారెడ్డి జిల్లా నార్సింగి గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు బాధితుడు ముదిరెడ్డి అశోక్ రెడ్డి ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



# పోలీస్ స్టేషన్ల పనితీరును సమీక్షించిన భువనగిరి డీఎస్పీ రవీందర్

- **ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి.. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలి**

**భువనగిరి, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

భువనగిరి డీఎస్పీ బి. రవీందర్ మంగళవారం భువనగిరి మహిళా పోలీస్ స్టేషన్, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించి స్టేషన్‌ల పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు తదితర అంశాలను సమీక్షించారు.
ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటీషనర్, బాధితుడితో పోలీసులు మర్యాదపూర్వకంగా, సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించడం ద్వారా పోలీసులపై విశ్వాసం, గౌరవం పెరుగుతాయని, పోలీసు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే శాఖకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు.
స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఆయన, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.
అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫిర్యాదు అందిన వెంటనే పెట్రో కార్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో పోలీసులు స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి, అవసరమైతే అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దాలని, అలాగే ప్రతి పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ 5ఎస్ విధానాలను కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి డీఎస్పీ రవీందర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్, టౌన్ ఎస్ఐలు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# రక్తం పాకెట్లతో రాజకీయం అవసరం లేదు..

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలని తెలంగాణ కాంగ్రెస్ తెలంగాణ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు ఇవాళ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఎస్ఐఆర్ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని హైదరాబాద్ లో 15 శాతం కూడా పూర్తి కాలేదని అన్నారు. బీఎల్ఓలు సరిగా పని చేయడం లేదని అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకోవాలని కోరినట్లు చెప్పారు.
రక్తం పాకెట్లతో రాజకీయం అవసరం లేదు: అనంతరం మీడియోతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి.. అనేక మంది శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ శాఖ వర్షాభావ పరిస్థితులు ఇబ్బందులు ఉంటాయని చెబుతున్నారని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందేకాళేశ్వరంకుంగిపోయిందనిరక్తం పాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని, ఊరూరా తిరిగి ఆ పార్టీ కుట్రలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక ప్రకారం నీళ్లు నింపమని చెప్తే మేం వెంటనే నింపుతామన్నారు. మేము ఇంజనీర్లం కాదు.. ఇంజనీర్లు ఇచ్చిన సలహాలు పాటిస్తామన్నారు. ప్రాజెక్ట్ ఉపయోగంలోకి రావాలంటే ఏమి చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని చెప్పారు.

**ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?:**
గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండి ఇప్పుడు కరువును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతోందని విమర్శించారు. కావాలని మేడిగడ్డ ,కన్నెపల్లిపై రాజకీయం చేస్తున్నారని సాంకేతిక నిపుణులతో నేషనల్ డామ్ సేఫ్టీ అధికారులు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎల్‌నినో ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరుపున సూచనలు చేస్తున్నామని కరువును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. శంకర పరివారంలో ఆవు, పాము, నెమలి ఉంటాయి. అన్ని వ్యక్తిగతంగా వైరుధ్యం ఉన్న అక్కడ కలిసి ఉంటాయి ఇక్కడ కూడా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కొట్లడాలని రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలన్నారు.బండి సంజయ్ ఎన్డీఎస్ఏను తుది నివేదిక ఇవ్వమని చెప్పాలన్నారు. వారు చెప్పి విధంగా నీళ్ళు నింపుతామన్నారు. నింపిన తరువాత ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు? అని ప్రశ్నించారు. గత రెండు సంవత్సరాలు గేట్లు వేయనప్పుడు ఎవరు మాట్లాడలేదని కేటీఆర్, హరీశ్ రావు ప్రభుత్వానికి సూచనలు చేయవచ్చు. కానీ లేనిది ఉన్నట్టు బట్ట కాల్చి మీద వేయవద్దన్నారు. బాధ్యతగా ప్రతిపక్షం సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

# ఏసీబీ వలలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారి..

**ఆశ్వి అప్డేట్స్**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు, రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13 (1) (బీ), 13 (2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ+4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది. వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు

- **సంక్షేమ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని భట్టి విక్రమార్క స్పష్టం చేస్తూ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు.**
- **ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు**

**ఆశ్వి అప్డేట్స్**



పదేళ్ల పాటు రాష్ట్ర సంపదను దోచుకుని తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన వారు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని, వచ్చి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయడానికేనా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తెలంగాణను రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించిందని ఆరోపించారు. అయినప్పటికీ రెండున్నరేళ్లలో రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తూ ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం తగ్గించకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.
రాష్ట్రంలో ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ భీమా, వడ్డీలేని మహిళా రుణాలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల వంటి పథకాలను నిరంతరంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం ఇప్పటికే ఆర్టీసీకి రూ.12 వేల కోట్లు చెల్లించామని, కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు.
అదనంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ.22,500 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నామని, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ భీమా పథకాన్ని నవంబర్‌లో ప్రారంభిస్తామని వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రెండున్నరేళ్లలో డ్వాక్రా సంఘాలకు రూ.76 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై స్పందిస్తూ, మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు అవసరమైన 573 ఎకరాల భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించారు. భూసేకరణ అనంతరం 87,500 ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగుతోందని భట్టి విక్రమార్క అన్నారు.

## టీం ఇండియా విజయం

ఇటీవల ఐర్లాండ్‌తో టీ20ల్లో ఓటమి, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో 04 తేడాతో వైట్‌వాష్ ఎదుర్కొని తీవ్ర విమర్శలు మూటగట్టుకున్న టీమిండియా ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 10 ఆధిక్యంలో నిలిచింది.
259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80 రిటైర్డ్ హర్ట్) అద్భుత అర్ధశతకంతో శుభారంభం అందించాడు. అయితే, రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో జట్టుపై ఒత్తిడి పెరిగింది. శ్రేయస్ అయ్యర్ (35)తో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు.
కానీ కీలక సమయంలో గిల్ గాయంతో మైదానం వీడటం, ఆ తర్వాత అయ్యర్, కేఎల్ రాహుల్ (1) వెంటవెంటనే ఔటవడంతో భారత్ 160 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో అద్భుతంగా ఆడిన ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్), అక్షర్ పటేల్ (57 నాటౌట్) అజేయమైన ఐదో వికెట్‌కు 102 పరుగులు జోడించి మరో 28 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు.
అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి ఒక దశలో 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను జో రూట్ (76 నాటౌట్), లియామ్ డాసన్ (68) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



## కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి

# ముద్రగడ పద్మనాభం కన్నుమూత

- **73 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లో తుదిశ్వాస.. రాజకీయ, సామాజిక రంగాల్లో విషాదం**

**హైదరాబాద్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ముద్రగడ పద్మనాభం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి కాకినాడ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎన్టీ రామారావు నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వంలో, అనంతరం మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2016లో తుని ఘటన అనంతరం కాపు రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఉద్యమానికి ముద్రగడ పద్మనాభం నాయకత్వం వహించి రాష్ట్రవ్యాప్తంగా కాపు ఉద్యమాన్ని ఉద్ధృతం చేశారు.



# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- **రూ.10 వేల జరిమానా.. ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించిన పోలీస్ కమిషనర్**

**ఖమ్మం, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితుడికి ఖమ్మం నాలుగో అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. నిందితుడిపై రూ.10 వేల జరిమానా కూడా విధిస్తూ న్యాయమూర్తి డా. జి.వి. మహేష్ నాథ్ మంగళవారం తీర్పు వెలువరించారు.
ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన రాప్రోలు వెంకటేశ్వర్లు అలియాస్ రాజు (32) 2021 ఫిబ్రవరి 13న రాత్రి ఖమ్మం నగరంలోని వినోద్ థియేటర్ సమీపంలో ఓ వివాహితతో మాట్లాడుతున్న శీలం వెంకటేష్‌పై పాత కక్షతో కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు.
బాధితుడి బంధువు ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి అభియోగపత్రాన్ని కోర్టులో దాఖలు చేశారు. విచారణ సందర్భంగా సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు నేరం చేసినట్లు నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. స్వప్న, దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, కోర్టు కానిస్టేబుల్ ఎం. రామకృష్ణ, కోర్టు లైజన్ ఎస్ఐ శ్రీకాంత్, హోంగార్డ్ శ్రీనివాస్‌లను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.









# ప్రదీప్ కన్స్ట్రక్షన్‌కు ఊరట కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన యాజమాన్యం

- **నిర్మాణ అనుమతుల రద్దు చట్టవిరుద్ధమని పిటిషన్.. హైడ్రా జోక్యంపైనా అభ్యంతరం**

**హైదరాబాద్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

సోమాజిగూడలోని నెక్లెస్ రోడ్ పరిసర ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న హైరైజ్ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ అనుమతుల రద్దును సవాలు చేస్తూ ప్రదీప్ కన్స్ట్రక్షన్ యాజమాన్య భాగస్వామి ప్రదీప్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైడ్రా (HYDRAA), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (MAUD) శాఖ, ఇరిగేషన్ శాఖతో పాటు భూమిని విక్రయించిన వారిని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, సంబంధిత ప్రాజెక్టుకు గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) చట్టబద్ధంగా నిర్మాణ అనుమతులు మంజూరు చేసిందని, అయితే ఏళ్ల తర్వాత నిబంధనల ఉల్లంఘన పేరుతో వాటిని రద్దు చేస్తూ నోటీసులు జారీ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ప్రభుత్వ అనుమతుల ఆధారంగా భారీ పెట్టుబడులతో నిర్మాణ పనులు చేపట్టిన అనంతరం అనుమతులను రద్దు చేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా, నిర్మాణ అనుమతులకు సంబంధించిన అంశాల్లో హైడ్రా జోక్యం చేసుకుని నోటీసులు జారీ చేయడం చట్టబద్ధం కాదని ప్రదీప్ రెడ్డి తన పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత చట్టాల ప్రకారం అధికార పరిధి లేని సంస్థ జోక్యం చేసుకోవడం వల్ల తమ హక్కులకు భంగం కలుగుతోందని వాదించారు. కేసులో తుది విచారణ పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీ, హైడ్రా తదితర ప్రభుత్వ శాఖలు జారీ చేసిన రద్దు నోటీసుల అమలును నిలిపివేయాలని హైకోర్టును కోరారు. న్యాయస్థానం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాల్సి ఉంది.





# రాష్ట్రంలో తొలిసారిగా 'సహచరి' కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ప్రారంభం

- **మహిళా సంఘాలతో పోలీస్–ప్రజల భాగస్వామ్యానికి శ్రీకారం.. 3 వేల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన**

**హైదరాబాద్, జూలై 14:**

మహిళల భద్రత, నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా "సహచరి" పేరుతో వినూత్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ నేతృత్వంలో మంగళవారం MEPMA, SERP సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి జోన్ పరిధిలోని మహిళల కోసం బోయిన్‌పల్లిలోని ఇంపీరియల్ గార్డెన్‌లో, ఎల్‌బీ నగర్, ఉప్పల్ జోన్ల మహిళల కోసం నాగోల్‌లోని శుభమ్ కన్వెన్షన్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని సుమారు 3,000 మంది స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చట్టపరమైన హక్కులు, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, అత్యవసర స్పందన, పోక్సో, ఎన్‌డీపీఎస్ చట్టాలు, కమ్యూనిటీ పోలీసింగ్, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్, మహిళా పోలీస్ స్టేషన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమను తాము రక్షించుకోవడంతో పాటు సమాజంలో నేరాల నివారణలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ, సమర్థవంతమైన పోలీసింగ్‌కు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. మహిళలు ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. "సహచరి" కార్యక్రమం ద్వారా కాలనీలు, బస్తీల స్థాయిలో సమాచార వ్యవస్థ బలోపేతమై, మహిళలు, పిల్లల భద్రత మెరుగుపడటంతో పాటు పోలీస్-ప్రజల మధ్య విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. MEPMA అదనపు మిషన్ డైరెక్టర్ డా. ఎన్. యాదగిరిరావు మాట్లాడుతూ, ప్రతి నెల జరిగే స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో భద్రత అంశాలపై చర్చించి, ఈ కార్యక్రమం ద్వారా పొందిన అవగాహనను మరింత మంది మహిళలకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ జోన్ల డీసీపీలు, మహిళా భద్రత విభాగం అధికారులు, పోలీస్ అధికారులు, MEPMA, SERP ప్రతినిధులు పాల్గొన్నారు. "సహచరి" కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన మహిళలు కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లుగా సమాజంలో భద్రతపై అవగాహన పెంపొందించడం, నేరాలపై సకాలంలో సమాచారం అందించడం, మహిళలు, పిల్లల రక్షణకు సహకరించడం వంటి బాధ్యతలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న వ్యాగనర్ కారు.. ఏఆర్ కానిస్టేబుల్ మృతి

**సిద్దిపేట, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టీఎస్ 30 టీఏ 3579 నంబర్ లారీ పాతూరు రింగ్‌రోడ్ ఫ్లైఓవర్ దాటిన అనంతరం పంచర్ షాప్ వద్ద నిలిపి ఉంచారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న టీఎస్ 08 జేవీ 4810 నంబర్ గల వ్యాగనర్ కారు లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఆరే కిరణ్, సిద్దిపేట ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ (బకిల్ నం. 236), ప్రస్తుతం హైదరాబాద్‌లోని *ఐఎస్‌డబ్ల్యూ (ISW)*లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రమాద తీవ్రతకు ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.







# తెలంగాణ పోలీస్ అకాడమీ–ASCI మధ్య అవగాహన ఒప్పందం

- **పోలీసు అధికారుల నాయకత్వ వికాసం, సామర్థ్య నిర్మాణానికి కొత్త ఊతం**

**హైదరాబాద్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి (RBVRR) తెలంగాణ పోలీస్ అకాడమీ మరియు హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ASCI) మధ్య పరస్పర సహకారం, నాయకత్వ వికాసం, సామర్థ్య నిర్మాణం, ఆధునిక శిక్షణా కార్యక్రమాలను బలోపేతం చేయడానికి మంగళవారం అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. ఈ ఒప్పందంపై తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్ట్ మరియు ASCI రిజిస్ట్రార్ & సెక్రటరీ ఓ.పీ. సింగ్ సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా రెండు సంస్థలు పరస్పర జ్ఞాన మార్పిడి, ఆధునిక పరిపాలనా విధానాలపై అవగాహన, నాయకత్వ వికాసం, సామర్థ్య నిర్మాణం, పరిశోధన, ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించడంతో పాటు ఇతర పరస్పర ప్రయోజనకర కార్యక్రమాల్లో భాగస్వామ్యం కానున్నాయి. పోలీసు అధికారుల పరిపాలనా నైపుణ్యాలను మెరుగుపరచడం, నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించడం, ఆధునిక పరిపాలనా ఉత్తమ విధానాలను పరిచయం చేయడం, సంస్థాగత సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలవనుంది. ఈ సందర్భంగా ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ ఒప్పందం రెండు ప్రతిష్ఠాత్మక సంస్థల మధ్య దీర్ఘకాలిక, ఫలవంతమైన భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని, ఉమ్మడి కార్యక్రమాల ద్వారా పోలీసు శిక్షణా రంగంలో నాణ్యతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్‌తో పాటు డిప్యూటీ డైరెక్టర్లు డా. చేతన (ఐపీఎస్), కవిత, వెంకటేశ్వర్లు, కేఆర్‌కే ప్రసాద్, శ్రీరామమూర్తి, వేమా శ్రీనివాసరెడ్డి, నరహరి, యార్లగడ్డ రాంబాబుతో పాటు ASCI ప్రతినిధులు పాల్గొన్నారు.






## డీజీపీ సి.వి. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా

# కలిసిన డీఎస్పీ నిఖత్ జరీన్

**హైదరాబాద్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

అంతర్జాతీయ బాక్సింగ్ ఛాంపియన్, తెలంగాణ పోలీసు శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా విధులు నిర్వహిస్తున్న నిఖత్ జరీన్ సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ నిఖత్ జరీన్ సాధించిన అంతర్జాతీయ విజయాలను అభినందిస్తూ, ఆమె భారతదేశానికి, తెలంగాణకు విశేష గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. ఆమె విజయాలు యువతకు, ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

భవిష్యత్తులోనూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి, తెలంగాణ పోలీసు శాఖకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగుతూ యువతకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

తాను కూడా క్రీడాకారుడిగా ఉన్న అనుభవాన్ని ప్రస్తావించిన డీజీపీ, క్రీడల్లో విజయానికి కఠిన శ్రమ, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం ఎంతో కీలకమని చెప్పారు. పోలీసు అధికారిణిగా బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే అంతర్జాతీయ బాక్సింగ్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నిఖత్ జరీన్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి డీఎస్పీగా అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను గౌరవంగా స్వీకరించానని, భవిష్యత్తులో భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోలీసు శాఖకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గౌరవం తీసుకురావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.





# భరోసా సేవలు బాధితులకు త్వరగా అందాలి

- **భువనగిరిలో భరోసా సెంటర్ సమీక్ష సమావేశంలో ఎస్పీ అక్షాన్ష్ యాదవ్**

**భువనగిరి, జూలై 15, ఆశ్వి అప్డేట్స్:**

మహిళలు, చిన్నారులపై హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర, సానుభూతితో కూడిన సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. భువనగిరిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన నిర్వహించిన భరోసా సెంటర్ సమీక్ష సమావేశంలో భువనగిరి కోర్టు న్యాయమూర్తి మాధవీలత, ఆర్డీవో కృష్ణారెడ్డి, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీలు, ఎస్‌హెచ్‌వోలు, వైద్యాధికారులు, భరోసా సెంటర్, మహిళా-శిశు సంక్షేమ శాఖ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు, న్యాయవ్యవస్థ, వైద్య, మహిళా-శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయంతో బాధితులకు చట్టపరమైన సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, రక్షణ, పునరావాస సేవలను సకాలంలో అందించాలని సూచించారు. భరోసా సెంటర్‌కు వచ్చే ప్రతి కేసును వెంటనే నమోదు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, అన్ని శాఖల సమన్వయంతో దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ గౌరవప్రదంగా వ్యవహరించాలని, అవసరమైన కౌన్సిలింగ్, పునరావాస సేవలను సమర్థవంతంగా అందించాలని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల అవగాహన, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధం, గృహ హింస నివారణ, భరోసా సెంటర్ సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే అత్యవసర సహాయ నంబర్లు, భరోసా సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, కేసుల రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ పెండింగ్ కేసులను నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. భరోసా సెంటర్ మహిళలు, చిన్నారులకు ఒకే వేదికపై సమగ్ర సేవలు అందించే కీలక వ్యవస్థ అని పేర్కొన్న ఎస్పీ, ప్రతి అధికారి బాధితుల్లో ధైర్యం, నమ్మకం పెంచేలా సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో భరోసా సెంటర్‌లో నమోదైన కేసుల పురోగతి, పెండింగ్ కేసులు, వివిధ శాఖల సమన్వయం, సేవల నాణ్యత మెరుగుదల, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.





# యాసిడ్ దాడి బాధితులకు పెద్ద ఊరట.. కేంద్రం కీలక సవరణ నోటిఫికేషన్!


దేశవ్యాప్తంగా యాసిడ్ దాడి బాధితులకు కేంద్ర ప్రభుత్వం కీలక శుభవార్త అందించింది. ఇప్పటి వరకు బాహ్యా గాయాలు కనిపించే బాధితులకు మాత్రమే ప్రధానంగా దివ్యాంగుల హక్కుల చట్టం 2016 కింద ప్రయోజనాలు అందుతున్న నేపథ్యంలో, ఇకపై బాహ్య గాయాలు లేకపోయినా అంతర్గత అవయవాలు దెబ్బతిన్న యాసిడ్ దాడి బాధితులకు కూడా అదే చట్టంలోని అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ఈ మేరకు దివ్యాంగుల హక్కుల చట్టం 2016లో అవసరమైన సవరణలను ఈ ఏడాది మే నెలలోనే నోటిఫై చేసినట్లు కేంద్రం తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగానే ఈ మార్పులు చేపట్టినట్లు కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ సవరణతో అంతర్గత గాయాల కారణంగా తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న యాసిడ్ దాడి బాధితులు పరిహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం, ఉపాధి అవకాశాలు, ఇతర చట్టపరమైన రాయితీలు వంటి పలు ప్రయోజనాలను పొందే అవకాశం కలగనుంది. యాసిడ్ దాడి బాధితుల పునరావాసం, సంక్షేమానికి ఈ నిర్ణయం కీలక అడుగుగా భావిస్తున్నారు. మొత్తంగా యాసిడ్ దాడి బాధితులకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం అమల్లోకి వచ్చింది. బాహ్యంగా గాయాలు లేదా ముఖవికృతి కనిపించకపోయినా, యాసిడ్ దాడి వల్ల అంతర్గత అవయవాలు దెబ్బతిన్న బాధితులకు కూడా ఇకపై దివ్యాంగుల హక్కుల చట్టం2016 కింద అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. ఈ మేరకు చట్టంలోని షెడ్యూల్‌ను సవరిస్తూ 2026 మే 22న అధికారిక నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపింది. ఈ అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం విచారించింది. యాసిడ్ దాడి బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL) విచారణ సందర్భంగా కేంద్రం ఈ వివరాలను కోర్టుకు సమర్పించింది.

ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పులో, బాహ్య గాయాలు లేకపోయినా అంతర్గత గాయాలతో బాధపడుతున్న యాసిడ్ దాడి బాధితులను కూడా చట్ట పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేసింది. అధికారిక సవరణ జరిగే వరకు కూడా అలాంటి బాధితులకు చట్టంలోని అన్ని హక్కులు వర్తిస్తాయని పేర్కొంది. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం చట్టంలో స్పష్టత తీసుకొచ్చేలా సవరణను నోటిఫై చేసింది. కోర్టు మరో కీలక వ్యాఖ్య కూడా చేసింది. ఈ సవరణ కేవలం వివరణాత్మకమైనదే (Clarificatory) కావడంతో, దివ్యాంగుల హక్కుల చట్టం2016 అమల్లోకి వచ్చిన నాటి నుంచే ఇది అమలులో ఉన్నట్లుగా పరిగణించాలని స్పష్టం చేసింది. దీంతో అంతర్గత గాయాలున్న యాసిడ్ దాడి బాధితులు కూడా పరిహారం, పునరావాసం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, ఇతర చట్టపరమైన రాయితీలు పొందే అవకాశం కలిగింది. విచారణ సందర్భంగా యాసిడ్ దాడులపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. యాసిడ్ దాడులకు పాల్పడిన నిందితుల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటి కఠిన చర్యలను పరిశీలించాలని, అలాగే నిబంధనలు ఉల్లంఘించి యాసిడ్ విక్రయించే దుకాణదారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గత విచారణల్లో సూచించిన విషయం తెలిసిందే. ఈ తాజా సవరణతో యాసిడ్ దాడి బాధితుల హక్కుల పరిరక్షణలో మరో కీలక ముందడుగు పడినట్టు అయ్యింది..

# ఇంజిన్ దెబ్బతింటుందన్న విమర్శలకు సవాల్

- **కుళ్లిన పండ్లు, కూరగాయలతోనూ ఇథనాల్ తయారు చేయొచ్చని వెల్లడి**



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 ఇంధన విధానంపై వస్తున్న విమర్శలకు కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి గట్టిగా స్పందించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు భారత్ దిగుమతి ఇంధనంపై ఎంతగా ఆధారపడుతోందో మరోసారి స్పష్టం చేశాయని పేర్కొన్నారు. దేశం ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే అంతిమ లక్ష్యమని చెప్పారు.

ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గడ్కరీ మాట్లాడుతూ.. భారత్ భవిష్యత్తులో బయోఫ్యూయల్స్, హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాల దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విదేశాల నుంచి ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం దేశ ఆర్థిక, వ్యూహాత్మక భద్రతకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. పశ్చిమాసియా సంక్షోభం ఇంధన దిగుమతులపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో చూపించిందని...ఇంధన రంగంలో ఆత్మనిర్భర్ భారత్ సాధించడమే తమ లక్ష్యమని గడ్కరీ తెలిపారు.

**కుళ్లిన పండ్లు, కూరగాయలతోనూ..**

ఇథనాల్ ఉత్పత్తి కోసం ఆహార పంటలను వినియోగించడం వల్ల ఆహార భద్రత దెబ్బతింటుందనే విమర్శలను గడ్కరీ ఖండించారు. "కొంతమంది ఇథనాల్ అంటే కేవలం ఆల్కహాల్ అని మాత్రమే భావిస్తున్నారు. కానీ ఇథనాల్‌ను అనేక రకాల ముడి పదార్థాలతో తయారు చేయవచ్చు. కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలతో కూడా ఇథనాల్ ఉత్పత్తి సాధ్యమే." అ స్పష్టం చేశారు. దేశం ఇంధన స్వయం సమృద్ధి సాధిస్తే ఇంధన భద్రత పెరగడమే కాకుండా కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ఈ20 పెట్రోల్ వాడితే వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారాన్ని గడ్కరీ కొట్టిపారేశారు. ఈ20 ఇంధనం పాత, కొత్త వాహనాల రెండింటికీ సురక్షితమేనని స్పష్టం చేశారు."ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి నష్టం లేదని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొన్ని విమర్శలు వాస్తవాల కంటే రాజకీయ ఉద్దేశాలతోనే వస్తున్నాయి." అని వ్యాఖ్యానించారు. ఇంతకుముందు కూడా గడ్కరీ ఇదే అంశంపై స్పందిస్తూ.. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల ఎవరి వాహనం దెబ్బతిన్నా సంబంధిత డీలర్‌తో పాటు తన మంత్రిత్వ శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. "ఇథనాల్ కారణంగా వాహనం దెబ్బతిన్నట్లు ఎవరైనా నిరూపిస్తే దర్యాప్తు చేసి తగిన పరిహారం అందిస్తాం. మీకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరి పేర్లు అయినా చెప్పగలరా.. ఇథనాల్ వల్ల వారి వాహనాలు దెబ్బతిన్నాయని?." అంటూ విమర్శకులకు గడ్కరీ సవాల్ విసిరారు.

## సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలో రూ.211 కోట్ల

# నూతన ఓపీడీ భవనం ప్రారంభం

- **దేశ శ్రమశక్తికి సేవ, గౌరవమే మోదీ ప్రభుత్వ లక్ష్యం: కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవ్య**

**హైదరాబాద్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలుక్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవ్య మంగళవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలో రూ.211.13 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన అవుట్‌పేషెంట్ (ఓపీడీ) భవనాన్ని ప్రారంభించారు. ఈ కొత్త భవనం ద్వారా తెలంగాణలోని 12.30 లక్షల మందికి పైగా ఈఎస్ఐ బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు ఆధునిక వైద్య సేవలు అందనున్నాయి.





ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి శ్రమశక్తి, యువశక్తి రెండు ప్రధాన స్తంభాలు అని పేర్కొన్నారు. సాంకేతికత, కృత్రిమ మేధ ఎంత అభివృద్ధి చెందినా దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికులకు గౌరవం, సామాజిక భద్రత కల్పించడం మోదీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

గత పదేళ్లలో ఈఎస్ఐసీ లబ్ధిదారుల సంఖ్య 7.5 కోట్ల నుంచి 15 కోట్లకు పెరిగిందని, సామాజిక భద్రత పరిధి 19 శాతం నుంచి 64 శాతానికి విస్తరించి 94 కోట్ల మంది ప్రజలకు చేరువైందని తెలిపారు. పేదలకు ఉచిత రేషన్, పక్కా ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలు కార్మిక కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని చెప్పారు.

దేశంలో కార్మిక సంస్కరణల కింద 29 పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కొత్త లేబర్ కోడ్లను తీసుకొచ్చామని మంత్రి వెల్లడించారు. నియామక పత్రాలు తప్పనిసరి చేయడం, 40 ఏళ్లు దాటిన కార్మికులకు వార్షిక ఉచిత ఆరోగ్య పరీక్షలు, స్త్రీపురుషులకు సమాన వేతనం, ఏడాది సేవ పూర్తిచేసిన వారికి గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలు ఈ చట్టాల్లో ఉన్నాయని వివరించారు.నూతన ఓపీడీ భవనంలో జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, డెంటల్, ప్రసూతిగైనకాలజీ, నేత్ర, ఆర్థోపెడిక్స్, చర్మ, మానసిక, శ్వాసకోశ, పిల్లల వైద్యం, జనరల్ సర్జరీ, ఆయుష్ తదితర విభాగాలు అందుబాటులో ఉంటాయి. అదనంగా రేడియాలజీ, యోగా, ఫిజికల్ మెడిసిన్ విభాగాలతో పాటు 180 సాధారణ పడకలు, 25 ఐసీయూ, 20 ఎన్ఐసీయూ పడకలు, మందుల దుకాణం, క్లినికల్ లెక్చర్ థియేటర్ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో ఓపీడీ భవన నిర్మాణంలో పనిచేసిన నిర్మాణ కార్మికులను మంత్రి ఘనంగా సత్కరించారు. అలాగే ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను పంపిణీ చేశారు.

ఈ నూతన ఓపీడీ భవనం ద్వారా హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు చెందిన లక్షలాది మంది కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందనున్నాయి.




## విడిపోతుంది, కలుస్తుంది, వస్తువులను మింగేస్తుంది..

# కొరియా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ!

- **జీవకణంలా ఆకారం మార్చుకునే లిక్విడ్ మెటల్ రోబో ఆవిష్కరణ**
- **దక్షిణ కొరియాలోని సియోల్, గచోన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల విజయం**
- **అయస్కాంత క్షేత్రాలతో నియంత్రణ.. ఇరుకు ప్రదేశాల్లోకి సులభంగా ప్రయాణం**
- **విడిపోవడం, తిరిగి కలవడం, వస్తువులను మింగేయడం దీని ప్రత్యేకతలు**
- **వైద్యం, పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో వినియోగించే అవకాశం**

టెక్నాలజీ రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు జీవకణంలా ప్రవర్తించే, తన ఆకారాన్ని మార్చుకోగల ఒక వినూత్నమైన లిక్విడ్ మెటల్ రోబోను అభివృద్ధి చేశారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, గచోన్ యూనివర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా రూపొందించిన ఈ రోబో, సాఫ్ట్ రోబోటిక్స్ రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ అధ్యయన వివరాలు ప్రముఖ సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ రోబోను ద్రవరూప లోహం (లిక్విడ్ మెటల్), అయస్కాంత కణాలతో తయారుచేశారు. దీని బయటి పొరపై నీటిని వికర్షించే (సూపర్ హైడ్రోఫోబిక్) కణాలతో కవచంలా ఏర్పాటు చేశారు. దీనివల్ల ఇది తన ఆకారాన్ని కోల్పోకుండా స్థిరంగా ఉంటుంది. బయటి నుంచి అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించి బ్యాటరీలు లేదా మోటార్లు లేకుండానే దీనిని నియంత్రించవచ్చు. ఈ రోబో తన పరిమాణం కన్నా చిన్నవైన, ఇరుకైన ప్రదేశాల్లోకి కూడా సులభంగా దూరిపోయి, బయటకు వచ్చాక తిరిగి తన అసలు ఆకారాన్ని సంతరించుకోగలదు. అంతేకాదు, అవసరమైనప్పుడు చిన్నచిన్న రోబోలుగా విడిపోవడం, మళ్లీ అన్నీ కలిసి ఒకే రోబోగా మారిపోవడం దీని ప్రత్యేకత. శరీరంలోని కణాలు బాహ్య పదార్థాలను మింగేసినట్టుగా (ఫాగోసైటోసిస్), ఈ రోబో కూడా చిన్న వస్తువులను తనలో ఇముడ్చుకుని ఒకచోటి నుంచి మరోచోటికి రవాణా చేయగలదు. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను తొలగించడానికి, శరీరంలోని నిర్దిష్ట భాగాలకు మందులను చేరవేయడానికి, అతి సూక్ష్మమైన సర్జరీలు చేయడానికి దీనిని ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగశాల దశలో ఉన్న ఈ రోబో, భవిష్యత్తులో పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో కూడా కీలకపాత్ర పోషించగలదని అంచనా వేస్తున్నారు.

## ఫిఫా నాకౌట్ మ్యాచ్‌లు: బెంగళూరు హోటళ్లకు అర్ధరాత్రి దాటాక కూడా అనుమతి

- **తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వ అనుమతి**
- **జులై 14, 15, 19 తేదీలకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తింపు**
- **అభిమానుల సౌకర్యార్థం, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం**

నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి శివకుమార్ ప్రకటన ఫిఫా ప్రపంచకప్ 2026 పోటీల నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను పురస్కరించుకుని బెంగళూరు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ వెసులుబాటుతో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగే మ్యాచ్‌లను క్రీడాభిమానులు ప్రత్యేక స్క్రీనింగ్‌ల ద్వారా వీక్షించే అవకాశం లభించింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం వెల్లడించారు. జులై 14, 15, 19 తేదీల్లో ఈ ప్రత్యేక మినహాయింపు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం కారణంగా, ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాతే ప్రసారం కానున్నాయి.

# 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధాని పర్యటన

- **భారత్–న్యూజిలాండ్ సంబంధాలకు వ్యూహాత్మక భాగస్వామ్య హోదా**

**ఆక్లాండ్, జూలై 14, ఆశ్వి అప్డేట్స్:**

దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్‌లో అధికారికంగా పర్యటించడం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. ఈ పర్యటనలో భారత్-న్యూజిలాండ్ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం (Strategic Partnership) స్థాయికి తీసుకెళ్లే కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రక్షణ, సముద్ర భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, విద్య, సాంకేతికత తదితర రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరు దేశాలు సంకల్పించాయి.

పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ భారతీయ ప్రవాసులతో సమావేశమై, భారత్-న్యూజిలాండ్ మధ్య ప్రజల మధ్య బంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. భారతీయ ప్రవాసులు ఇరు దేశాల సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.




ఈ చారిత్రాత్మక పర్యటనతో భారత్-న్యూజిలాండ్ సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయని, ఆర్థిక, వ్యూహాత్మక, ప్రజల మధ్య సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# అద్భుతం ఒక్కసారే జరగాలి

**జయశ్రీ బర్మన్.. ఆమె ఒక ఫేమస్ ఆర్టిస్ట్. అనంత్ అంబానీ పెండ్లి వేడుకకు ఆమెకు ఒక అనుబంధం ఉంది. అదేంటంటే.. పెండ్లి తర్వాత జరిగిన శుభ్ ఆశీర్వాద్ వేడుక జరిగింది. ఆ వేడుకకు కొత్త పెండ్లి కూతురు రాధిక మర్చెంట్ ఒక బ్యూటిఫుల్ లెహంగా ధరించింది. ఆ లెహంగా మీద ఉన్న డిజైన్ చేత్తో వేసిన పెయింటింగ్ . దాన్ని అంత అందంగా తీర్చిదిద్దిన ఆర్టిస్ట్ జయశ్రీ.**



ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్ కలయికతో రూపుదిద్దుకున్న వెడ్డింగ్ లెహంగా ఇది. అంబానీ ఇంట పెండ్లి వేడుకకు, పెండ్లి కూతురు రాధిక మర్చెంట్ ధరించిన దుస్తుల్లో కొన్ని అబు జానీ సందీప్ ఖోస్లా డిజైన్ చేశారు. అయితే, శుభ్ ఆశీర్వాద్ వేడుకకు మరో లెహంగా డ్రెస్ తయారుచేయాల్సి ఉంది. దాంతో ఆ లెహంగాపై పెయింటింగ్ వేయించాలనే ఆలోచనతో జయశ్రీని పిలిపించారు. ఆమె తనదైన స్టయిల్లో ఆ లెహంగాపై అద్భుతమైన పెయింటింగ్ వేశారు.

**ఇలా తయారైంది..**

ప్రత్యేక ఇటాలియన్ కాన్వాస్పై 12 హ్యాండ్ పెయింట్ వేసిన ప్యానెల్స్ తో కూడిన లెహంగా ఇది. జయశ్రీ బర్మన్ ఢిల్లీలోని తన స్టూడియోలో ఈ లెహంగా ఫ్యాబ్రిక్పై పెయింటింగ్ చేయడానికి నెలరోజుల పట్టింది. రోజుకు 16 గంటలు పెయింటింగ్ వేయడానికి కేటాయించారట. దీని మీదున్న మనిషి బొమ్మలు ఆనందంగా ఉన్న జంటను తెలియజేస్తే, ఏనుగులు, పూలు, హంసలు ఇతర బొమ్మలు అనంత్కు జంతువుల మీద ఉన్న ప్రేమకు ప్రతీకలు. ఈ లెహెంగాలో నిజమైన బంగారు జర్దోజీ ఎంబ్రాయిడరీ, జయశ్రీ కళా కృతులను హైలైట్ చేసే సీక్వెన్ల వరుసలు ఉన్నాయి. అబు జానీ సందీప్ ఖోస్లా మాస్టర్ క్రాఫ్ట్స్ మెన్ డిజైన్ చేసిన రేషమ్ఎంబ్రాయిడరీ బ్లౌజ్ తో ఈ లెహెంగా జత చేశారు. దీనిపై జయశ్రీ... "రియా, అబూ సందీప్ ఇద్దరూ నాకు పూర్తి సృజనాత్మక స్వేచ్ఛను ఇచ్చారు. ఈ కళాఖండం రాధిక ముఖంలో చిరునవ్వు తెస్తుందని, బహుశా ఏదో ఒక రోజు ఆమె గోడపై దీనికి స్థానం లభిస్తుందని నేను ఆశిస్తున్నాను" అన్నారామె. అంతేకాకుండా నా ఆర్టిస్ట్ ప్రతిభతో నేను అద్భుతమైన పెయింటింగ్ చేశానని భావిస్తున్నా. ఇకపై మళ్లీ దాన్ని రిపీట్ చేయను. అది అలానే గుర్తుండిపోవాలి" అని చెప్పారు.

**రచయిత్రిగా జాతీయ అవార్డు**

ఇండియన్ ఆర్టిసట్గా గుర్తింపు పొందిన జయశ్రీ బర్మన్ కోల్కతాలో జన్మించారు. పెయింటింగ్లో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, ప్యారిస్ లో ప్రింట్ మేకింగ్ కోర్సు చేసిన ఆమె తన పౌరాణిక కథలను పెయింటింగ్ రూపంలో చూపిస్తారు. ఆమె ఆర్టిస్ట్ మాత్రమే కాదు. రచయిత్రి కూడా. ఎంత పెద్ద రచయిత్రి అంటే.. ఆమె రచనలకు జాతీయ అవార్డులు కూడా దక్కాయి.





## ఉపాయం ఉంటే ఏదీ వృథా కాదు





**కూరగాయలు తాజాగా ఉంటేనే వంటకు వాడతుంటాం. అవి కాస్త పండినా, ముదిరినా వెంటనే పడేస్తుంటాం. అవి వంటకు పనికిరావు అనుకుంటాం. కానీ, అది పొరపాటు. ఎందుకంటే వాటితో కూడా రుచికరంగా వంట చేయొచ్చు తెలుసా. అలాంటివాటిలో వంటకు వీలయ్యే కూరగాయలు ఏవో ఇప్పుడు తెలుసుకుందాం.**

కూరగాయలు ఎక్కువ ఉంటే వాటిని గుండ్రంగా కోసి, ఎండబెట్టుకుని వాడొచ్చు. లేదా గుజ్జు చేసి దాన్ని భద్రపరుచుకుంటే తర్వాత ఎప్పుడైనా వాడొచ్చు. దొండకాయ పండితే.. ఎండు మిర్చి, టొమాటో వేసి రోటిపచ్చడి చేయండి. వేడి అన్నంతో తింటే టేస్ట్ అదిరిపోద్ది.

ముదిరిన వంకాయలతో నిల్వ పచ్చడి పెట్టుకోవచ్చు. క్యాలీఫ్లవర్, క్యాబేజీ కాడలను కూడా తినొచ్చు. ఎలాగంటే.. వాటితో నిల్వ పచ్చడి పెట్టుకోవాలన్నమాట. బంగాళదుంప, పచ్చి అరటి తొక్కలను కాస్త కండ ఉండేలా కోసుకొని, నూనెలో వేయించుకుంటే చిప్స్లా తినొచ్చు.

అరటిపండ్ల తొడిమలను పాలిథీన్ కవర్తో చుడితే.. త్వరగా పాడవ్వవు. సింక్, కిటికీలు, ట్యాపులు అరటి తొక్కలతో క్లీన్ చేస్తే.. మెరుస్తాయి.

ఏదైనా మిగిలిపోతే వాటిని తిరిగి ఎలా ఉపయోగించొచ్చో ఆలోచించండి. ఒకవేళ పాడైతే అలాంటివాటిని ఓ డబ్బాలో వేసి కంపోస్టుగా మార్చండి. మొక్కలకి ఎరువుగా పనికొస్తుంది. ఇంటి నుంచే వృథా తగ్గిస్తే... చాలావరకూ ప్రకృతికి మేలు చేసినట్లే కదా.







## దోమల బెడదకు గుడ్ బై



వానాకాలంలో దోమల బెడద చాలా ఎక్కువ. వాటిని తరమడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుంటాం. అయినా కొన్నిసార్లు దోమకాటును తప్పించుకోలేకపోతాం. అయితే ఈ కాలంలో దోమలు కుడితే జ్వరాలు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని తక్షణమే తరిమేయాలి. అందుకోసం ఈ చిట్కాలు పాటించండి.

మూడు టేబుల్ స్పూన్ల ఎప్సమ్ సాల్ట్ని ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో వేసుకుని స్నానం చేయండి. దోమ కాటు నుంచి మీ శరీరాన్ని కాపాడుకోవచ్చు. లేదంటే కప్పు నీళ్లలో యూకలిప్టస్ ఆయిల్ రెండు చుక్కలు కలిపి ఇల్లంతా స్ప్రే చేస్తే సరి.

నాలుగు వెల్లుల్లి రెబ్బలను దంచి దానికి కాస్త కర్పూరం, కొద్దిగా ఏదైనా నూనె వేసి.. వెలిగిస్తే దోమలు రావు.

కర్పూరం, వేప ఆకులు కలిపిన మిశ్రమాన్ని కిటికీలు, గుమ్మాల దగ్గరా పొగ వేయండి. లేదా సాంబ్రాణి పొగ వేసి తలుపులు మూసేయండి. వాసనకు దోమలు రాకుండా ఉంటాయి.

వేపనూనె, కొబ్బరినూనె కలిపి ఒంటికి రాసుకుంటే కనీసం ఎనిమిది గంటలపాటు దోమలు మీ దరిచేరవు. ఇది ఎక్కువగా దోమలు కుట్టే వాళ్లకు పనికొచ్చే చిట్కా.





# స్టైలిష్ అథ్లెట్స్ @ పారిస్ ఒలింపిక్స్

**ఫ్యాషన్, స్టయిల్ అనేవి ఒక రంగానికి పరిమితం కాదు. ఏ రంగంలోని వారైనా తమ అభిరుచికి తగ్గట్టు ఫ్యాషన్ ఫాలో అవుతుంటారు. వాళ్ల టాలెంట్ తోపాటు వాళ్ల స్టయిల్ కూడా అభిమానులకు గుర్తుంటుంది. అలాంటివాళ్ల గురించి చెప్పకోవాలంటే ముందుగా క్రికెట్‌లో ధోని, కోహ్లీ, పాండ్యా లాంటి వాళ్లు ఉన్నారు. వాళ్లు ఆటలో ఎంత డెడికేషన్ చూపిస్తారో.. తమదైన ఫ్యాషన్‌ని ఫాలో అవడంలో కూడా అంతే శ్రద్ధ చూపిస్తారు. ఇదే కోవలో ఒలింపిక్స్ ఫ్యాషన్ గురించి ఇప్పుడు హాట్ టాపిక్.**

ఇప్పుడు ఒలింపిక్ ట్రెండ్ నడుస్తోన్న విషయం తెలిసిందే.పారిస్ ఒలింపిక్స్ 2024లో ఇండియా తరఫున 16 క్రీడల్లో 117 మంది అథ్లెట్స్ పాల్గొన్నారు. అయితే, అందులో 70 మంది మగవాళ్లు ఉండగా 47 మంది మహిళా క్రీడాకారులు ఉన్నారు. అయితే, ప్రతిసారీ ఒలింపిక్స్ టైంలో క్రీడాకారులు తమదైన ఫ్యాషన్ లుక్‌లో అలరిస్తారు. వాళ్లలో మనదేశం నుంచి సానియా మీర్జా మొదటి స్థానంలో ఉంటారు. మరి ప్రజెంట్ ఎవరెవరు ఫ్యాషన్ లుక్స్‌లో అదరగొడుతున్నారో చూద్దాం.

## ఇది షూటర్ స్టయిల్ - మను బాకర్



ఇండియా తరపున షూటింగ్ విభాగంలో మను బాకర్ తన విశ్వరూపం చూపిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు మెడల్స్ సాధించి చరిత్ర సృష్టించింది. మరి ఆమె స్టైల్ విషయంలో.. ఇండో వెస్ట్రన్ లుక్‌లో ఫిదా చేస్తోంది. ఉదాహరణకు కుర్తీ డ్రెస్ వేసుకుని, దానిపై బెల్ట్, మెడకు శాలువా చుట్టుకుని, షూతో ట్రెడిషనల్ లుక్‌కి మోడ్రన్ టచ్ ఉండేలా ఎంచుకుంటుంది.

## హ్యాండ్సమ్ హంక్ - నీరజ్ చోప్రా



జావెలిన్ త్రో విభాగంలో 2020లో ఇండియా తరపున ఆడి మెడల్స్ తెచ్చి పాపులారిటీ తెచ్చుకున్నాడు నీరజ్. గతంలో తను హెల్త్ పరంగా ఇష్యూలు కూడా ఫేస్ చేశానని చెప్పిన విషయం తెలిసిందే. అయితే, తను ఇప్పుడు ఎంత ఫిట్‌నెస్ ఫ్రీక్ అనేది చూస్తూనే ఉన్నాం. తను బయటికి వెళ్లినప్పుడు ఎక్కువగా కంఫర్టబుల్‌గా ఉండే హుడీలు ఎంచుకుంటుంటాడు. దానికి తగ్గట్టు జాగర్ ప్యాంట్స్ వేసి స్టైలిష్‌గా కనిపిస్తాడు. ఈ హ్యాండ్సమ్ అథ్లెట్ స్టైల్లో కూడా తక్కువేం కాదు.



# వానాకాలంలో ట్రెక్కింగ్‌కి వెళ్ళాలా..

**ట్రావెలింగ్ చేయాలనుకునేవాళ్లకు సీజన్‌తో పనిలేదు. ఏ సీజన్ అయితే ఆ సీజన్‌కు తగ్గట్టు ప్రదేశాలు ఎంచుకుంటుంటారు. అయితే, వానాకాలంలో ట్రెక్కింగ్ చేయాలనుకుంటే మాత్రం ఈ విషయాలు గుర్తుపెట్టుకోవాలి. అప్పుడే వెకేషన్ ఎంజాయ్ చేయగలరు. అవేంటంటే..**



- ఎక్కడికి వెళ్ళాలో ముందే డిసైడ్ అవ్వాలి. ఆ తరువాత రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి.
- మీరు ట్రెక్కింగ్ కు వెళ్ళే ప్రదేశం అనువైనదా.. కాదా? అనే విషయం తెలుసుకోవాలి.
- స్టే చేయడానికి బేస్ క్యాంపులు ఉన్నాయా? లేదా? తెలుసుకోవాలి. ఒకవేళ ఉన్నాయంటే.. అక్కడ మీ బడ్జెట్ తగ్గట్టు వసతి సదుపాయాలు ఇస్తున్నారా? లేదా? అనేవి తెలుసుకోండి.
- ప్రయాణాలు చేసే ముందు ఏమేమి తీసుకెళ్ళాలో లిస్టు ముందుగానే సిద్ధం చేసుకోండి.
- ట్రెక్కింగ్ చేయడానికి వెళ్లున్నారు కాబట్టి ట్రెక్కింగ్ షూ తప్పనిసరి. లేస్ ఉన్న షూ అయితే బెటర్.
- ఫస్ట్ ఎయిడ్ కిట్, టార్చ్, వాటర్ ప్రూఫ్ జాకెట్, రెడీ మేడ్ ఫుడ్, ఫిల్టర్ నీళ్ళు వెంట తీసుకెళ్ళండి. అలాగని లగేజీ ఎక్కువ తీసుకెళ్లొద్దు. ముఖ్యంగా ట్రెక్కింగ్ చేసేవారు తక్కువ లగేజీతో బ్యాగ్ తీసుకెళ్లటం బెటర్.
- కాటన్ దుస్తులను వేసుకుంటే ఒకవేళ తడిచినా తొందరగా ఆరిపోతాయి. వీలైతే, కాటన్ దుస్తులను లోపల ధరించి, బయట జర్కిన్ లేదా రెయిన్ కోట్ వేసుకోవచ్చు.
- ఆ ప్రదేశం గురించి పూర్తి అవగాహన కలిగి ఉంటేనే వెళ్లండి. ఒంటరిగా వెళితే గైడ్ సహాయం తీసుకోవాలి. అవసరమైతే అధికారులకు కూడా సమాచారం ఇవ్వండి.
- మంజుమ్మెల్ బాయ్స్ సినిమా చూశారుగా.



# అబ్బాయిలూ అందంగా..

**అందం అనేది అమ్మాయిలకు వాడే పదం కాదు. వాళ్లు మాత్రమే ఫాలో అయ్యే పని కాదు. ఆడ, మగ ఇద్దరికీ సంబంధించినది. కాబట్టి ఎవరైనా అందంగా కనిపించాలనుకోవడంలో తప్పు లేదు. ఇంతకీ అబ్బాయిలు అందంగా కనిపించాలంటే ఏం చేయాలంటారా? ఇవిగో ఈ టిప్స్ పాటిస్తే చాలు.**


ప్రతి రోజు కూడా ముఖాన్ని రెండు సార్లు శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉండే దుమ్ము, ధూళితోపాటు అదే విధంగా చర్మం పై ఉండే డెడ్ స్కిన్, జిడ్డు వంటివి కూడా తొలగిపోతాయి. దీంతో చర్మ సమస్యలు రాకుండా ఉంటాయి.



### ఆరోగ్యమే అందానికి మూలం...

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యం సరిగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలి. మీరు తీసుకునే ఆహారంలో మంచి పోషక పదార్థాలు తప్పకుండా ఉండేలా చూసుకోండి. మీ బ్లడ్ షుగర్ లెవల్స్‌ని సరిగ్గా కంట్రోల్‌లో ఉండే ఆహార పదార్థాలను తీసుకోండి. వీటితో పాటుగా ఎక్కువ నీళ్లు తాగడం కూడా చాలా ముఖ్యం. నీళ్ళు ఎక్కువగా తాగడం వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉంటుంది. చర్మం సాగిపోకుండా ఉండడానికి సాయపడతుంది.

- మెరిసే చర్మం కోసం కనీసం వారానికి రెండు నుండి మూడు సార్లు ఎక్స్‌ఫోలియేషన్ చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం క్లియర్‌గా ఉంటుంది. కాకపోతే ఎక్స్‌ఫోలియేషన్ చేసేటప్పుడు గట్టిగా ఉండే స్క్రబ్స్, బ్రష్లు వంటివి ఉపయోగించ వద్దు. వీటిని కనుక ఉపయోగిస్తే దురద ఇరిటేషన్ లాంటి సమస్యలు వస్తాయి.
- విటమిన్ సి లేదా యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే ప్రొడక్టులను ఉపయోగించాలి. రెగ్యులర్‌గా సన్ స్క్రీన్‌ని ఉపయోగించండి. దీంతో మీ చర్మం బాగుంటుంది.
- అదే విధంగా పురుషులకి మంచి మాయిశ్చరైజర్ కూడా చాలా ముఖ్యం. పురుషులు తమ స్కిన్ కేర్ రొటీన్‌లో మాయిశ్చరైజింగ్ కూడా చేస్తూ ఉండాలి. క్లెన్సింగ్ మరియు షేవింగ్ చేసుకోవడం మాత్రమే చేయడం వల్ల చర్మం డ్రైగా ఉంటుంది. కాబట్టి మంచి మాయిశ్చరైజర్‌ని ఉపయోగించండి.



# సస్పెన్స్ థ్రిల్లర్‌తో రీ ఎంట్రీ ఇవ్వబోతున్న హీరోయిన్

ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్లు అందుకుంటూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది హన్సిక.

చాలా గ్యాప్ తర్వాత కన్నడలోకి.. సస్పెన్స్ థ్రిల్లర్‌తో రీ ఎంట్రీ ఇవ్వబోతున్న హీరోయిన్

ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్ల అందుకుంటూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది హన్సిక. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో ప్రేమ వివాహం చేసుకుని సినిమాలకు దూరం కాగా.. ఇటీవల విడాకులు తీసుకుని ప్రజెంట్ తన సెకండ్ ఇన్నింగ్స్‌పై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు సినిమా ఆఫర్ల కోసం ఎదురు చూస్తూనే పలు షోలకు జడ్జీగా వ్యవహిరిస్తూ సందడి చేస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా హన్సిక సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఒకటి వైరల్‌గా మారింది. చాలా గ్యాప్ తర్వాత ఈ బ్యూటీ మళ్లీ శాండల్‌వుడ్‌కు తిరిగి ఎంట్రీ ఇవ్వబోతుంది. దివంగత పునీత్ రాజ్‌కుమార్ సరసన 'బిందాస్' సినిమాతో కన్నడలో అరంగేట్రం చేసిన హన్సిక.. ఆ తర్వాత మళ్లీ కన్నడలో సినిమా చేయలేదు. ఈ క్రమంలోనే ఇన్నాళ్లకు తన రెండో చిత్రాన్ని ఓకే చేసింది. 'పారడాక్స్' అనే పాన్-ఇండియా సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంలో ఆమె ప్రధాన పాత్రలో నటించబోతుంది. సుదీర్ఘ విరామం తర్వాత కన్నడ చిత్రసీమలోకి హన్సిక తిరిగి వస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ వైరల్‌గా మారింది. కెప్టెన్ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, మరియు హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



## పబ్లిక్‌గా ఫొటోగ్రాఫర్‌కు చుక్కలు

# చూపించిన బాలీవుడ్ నటి!

బాలీవుడ్ నటి జరీన్ ఖాన్ ఇటీవల ముంబైలో జరిగిన ఓ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ఈ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా స్టోర్‌లోని దుస్తులను పరిశీలిస్తున్న జరీన్ ఖాన్‌ను ఓ ఫొటోగ్రాఫర్ "ఆ డ్రెస్సును ట్రై చేయొచ్చుగా" అని అడగటంతో ఆమె ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన జరీన్, "ఏంటి.. మీ ముందేనా? ఇలాంటి అర్థంలేని మాటలు నా ముందు మాట్లాడొద్దు. హద్దులో ఉండండి" అంటూ గట్టిగా హెచ్చరించారు. పబ్లీక్‌గా తనను అలా అడగడంతో, ఆమె ఆ పరిస్థితిని ఎంతో ధైర్యంగా, స్పష్టంగా ఎదుర్కొన్న తీరు ప్రశంసలు అందుకుంటోంది. ఈ వీడియో బయటకు వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో జరీన్ ఖాన్‌కు భారీగా మద్దతు లభిస్తోంది. "ఆమె చెప్పింది పూర్తిగా సరైనదే", "ఫోటోగ్రాఫర్స్ కూడా తమ హద్దులు తెలుసుకోవాలి", "కెమెరా ముందు ఎవరైనా బట్టలు మార్చుకుంటారా?" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు అసౌకర్యంగా అనిపించిన సందర్భంలో గౌరవంగా కానీ గట్టిగా ఎలా స్పందించాలో జరీన్ ఖాన్ చూపించారని అభినందిస్తున్నారు. 2010లో సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కిన 'వీర్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన జరీన్ ఖాన్, తర్వాత 'హౌస్‌ఫుల్ 2', 'హేట్ స్టోరీ 3', 'అక్సర్ 2', '1921' వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు పొందారు. చివరిసారిగా 2021లో రిలీజ్ అయిన 'హమ్ భీ అకేలే, తుమ్ భీ అకేలే' చిత్రంలో కనిపించిన ఆమె ప్రస్తుతం సినిమాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ, ఈ ఘటనతో మరోసారి వార్తల్లో నిలిచారు.

# ఎంత పెద్ద ఛాన్స్ అయినా సరే... అలాంటి బట్టలు వేసుకోను



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి చేసుకుని, ఒక బిడ్డకు తల్లి అయినప్పటికీ గ్లామర్ విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. తన సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ చందమామ.. అటు సోషల్ మీడియాలో కూడా హాట్ ఫొటోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ నటించిన 'ది ఇండియా స్టోరీ' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. షూటింగ్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 24న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇంటర్వ్యూలు ఇస్తున్న కాజల్.. తాజాగా ఒక ఆసక్తికరమైన ప్రశ్నపై ఎంతో ధైర్యంగా స్పందించారు. భవిష్యత్తులో బికినీ వేసుకునే పాత్రలు వస్తే నటిస్తారా? అనే ప్రశ్నకు కాజల్ అగర్వాల్ ఎవరూ ఊహించని విధంగా సమాధానమిచ్చారు. తనకు బికినీ వేసుకోవడం అస్సలు ఇష్టం ఉండదని, అలాగే హద్దులు దాటిన రొమాంటిక్ సీన్స్‌లో కూడా ఎట్టిపరిస్థితుల్లో నటించనని ఆమె ఖరాఖండిగా చెప్పారు. నటిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి తనకంటూ కొన్ని హద్దులు, నియమాలు పెట్టుకున్నానని, వాటిని ఎప్పుడూ దాటబోనని స్పష్టం చేశారు. ఒకవేళ ఖచ్చితంగా బికినీ వేసుకోవాలని ఎవరైనా పట్టుబడితే.. అలాంటి అవకాశాలను చేతులారా వదులుకోవడానికైనా సిద్ధమే తప్ప తన పద్ధతిని మార్చుకోనని కాజల్ తేల్చి చెప్పారు. అది ఎంత భారీ బడ్జెట్ సినిమా అయినా, ఎంతటి పెద్ద స్టార్ ప్రాజెక్ట్ అయినా, చివరకు సినిమాలో అది ఎంత ముఖ్యమైన పాత్ర అయినా సరే.. తన పరిమితులకు లోబడి లేకపోతే నిర్మొహమాటంగా తిరస్కరిస్తానని వెల్లడించారు. నటన విషయంలో తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని, జీవితంలో వాటిని కచ్చితంగా పాటిస్తానని కాజల్ చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఒకప్పుడు గ్లామర్ డోస్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన కాజల్ ఇప్పుడిలా మాట్లాడటంతో అంతా ఆశ్చర్యపోతున్నారు.

# రంగస్థలం నేను రాసిన కథ




ఆయన ఆ ఇంటర్వ్యూలో సుకుమార్ డైరెక్షన్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను 'కేరాఫ్ కంచరపాలెం' సినిమా తెరకెక్కిస్తున్న సమయంలోనే తన రెండో కథ రాసుకొని, ఆ సినిమా టైటిల్‌గా 'రంగస్థలం'ను నిర్ణయించుకున్నానని వెంకటేష్ మహా తెలిపారు. ఆ సినిమా సెట్లో పనిచేసిన వారందరికీ కూడా ఆ సినిమాకు సంబంధించిన చిన్న టీజర్ లాంటింది చూపించానని, తన నెక్ట్స్ సినిమా పేరు 'రంగస్థలం' అనే విషయం కూడా తెలుసని చెప్పారు. 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య', 'రావు బహదూర్' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వెంకటేష్ మహా. తాజాగా ఆయన ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే అదే సమయంలో డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కబోయే చిత్రానికి 'రంగస్థలం' అనే టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారని గుర్తుచేశారు. ఆ టైటిల్ తన డెబ్యూ సినిమా తర్వాత చేయాలనుకున్న సినిమాకు అనుకున్నప్పటికీ, సుకుమార్ వంటి తాను ఎంతో గౌరవించే సీనియర్ డైరెక్టర్ అదే పేరును ఎంచుకోవడం తనకు ఆనందంగా అనిపించిందని వెంకటేష్ మహా చెప్పారు. " 'రంగస్థలం' నా ఫేవరెట్ టైటిల్. అది నా తర్వాతి సినిమాకు అనుకున్న పేరు. కానీ సుకుమార్ గారు ఆ టైటిల్‌ను తన సినిమాకు పెట్టడం చూసి చాలా సంతోషించాను. ఆయన నాకు సీనియర్. నేను ఎప్పుడూ గౌరవించే దర్శకుడు. అందుకే ఎలాంటి బాధ అనిపించలేదు" అని వెంకటేష్ మహా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S